# ‘ముచ్చట’

అందాల తామరకొలనునుంచి రంగురంగుల నగిషీలతో తీర్చబడిన నిండు కుండలను చంకకెత్తుకుని ఒక చేతితో ఆడంగులకు అడ్డం పడుతూన్న వంగ పువ్వు రంగుకుచ్చెళ్ళను ఎత్తిపట్టుకుని వయ్యారంగా ఇళ్ళకు మళ్ళుతూన్న సుందరాంగులను, పచ్చని మైదానాలమీంచి సాగిపోతున్న కుంజరయూథంపలె నీలాకాశంలో గుంపులుగుంపులుగా ప్రయాణిస్తున్న మబ్బులు వెన్నాడుతున్నాయి.

ఆలమందలను మేపుకునే గొల్లపిల్లలు చెట్లకొమ్మలమీద కూర్చుని వాయించే మురళీరవమూ, పచ్చని పంటచేలమధ్య మంచెమీద నిల్చుని చిన్నవాడు విసిరిన వడిగకు రివ్వుమని ఒక్కమారు నింగికి ఎగిరిన పక్షులు చేసే కిలకిలారవాలూ, ఆ యువతుల అందెలరవళికి వారి యవ్వనపు పొంగులకి, వారి ముసిముసి నవ్వులకి శృతి కలుపుతున్నాయి.

అంతలో పిట్టల్ని అదిలించిన వడిగ నేరుగా వచ్చి యువతి చంకనున్న నిండు కుండను ముక్కచెక్కలు చేసింది. కుండకికుండా పగిలింది, నీళ్లకునీళ్లూ నేలపాలయాయి.

ఆమె అందమైన చింపికళ్ళు నీళ్ళతో విశ్చలమైనాయి.

చుట్టూవున్న సావాసకత్తెలు చిన్నబోయిన ఆమె ముఖాన్ని చూసి, ఆమె చూపుల్ని అనుసరించి మంచెమీంచి దిగుతున్న చిన్నవాడ్ని మెటికలు విరిచారు.

అతగాడు ఎప్పుడు మంచె దిగాడో, ఎప్పుడు చెరువుకు వెళ్ళాడో, అచ్చం అలాంటి కుండనే ఎక్కడ సంపాదించాడో, కుండనిండా నీళ్ళు నింపుకుని అంతలో వచ్చి, ఆమెకు అల్లంత దూరంలో నిలబడి పశ్చాత్తప్తమైన చూపులతో అర్ధమైన హృదయభావాన్నే ఆమె కల్పిస్తున్నంతటి తృప్తితో ఆ కుండ వందివ్వబోయాడు.

---

పురాణం సూర్యప్రకాశరావు

---



నే చెప్పిన రిస్ట్ ఇది కాదోయ్! సింహాచలం!

కుండ అందుకోవటమో మానటమో తెలియక బిత్తరచూపులతో కంగారుగా చుట్టూవున్న వనితలవైపు చూసింది ఆమె.

ముంచుకువస్తూన్న సిగ్గుతో పూర్ణబిందువై పవిట నోటికి అడ్డం పెట్టుకుని ముందుకు పరుగు తియ్యబోయిన ఆమెకు ఎదురువచ్చి నిలబడ్డ అతనివద్దనుంచి వనితల ముసిముసి నగవులమధ్య అధోముఖియై ఆమె అందుకుంది పూర్ణభాండాన్ని.

వనితలు వెళ్ళిపోయింతర్వాత వారి పాదముద్రలను చూస్తూ ఒంటరిగా ఆలోచిస్తూ వుండిపోయిన అతడ్ని గొల్లపిల్లలు చుట్టుముట్టి మురళి వాయిస్తూ మధ్యమధ్య ఎగతాళిగా అతడ్ని అడుగుతున్నారు.

"నీ వద్దనుంచి వారు ఏమిటి తీసుకువెళ్ళారు? నీకు మిగిలిం దేమిటి?" అని.

వెంటబడినవారినుంచి తప్పించుకుని అతను పంటచేలోకి వెళ్ళిపోయాడు.

ఈ ముచ్చట చూసి ఆకాశం ఫక్కుమని నవ్వి, ముత్యాలవంటి చినుకుల్ని భూమ్మీదకు చల్లింది.